క్లుప్తంగా

తాగునీటి కోసం ఆందోళన



రాజంపేట: మండల కేంద్రమైన రాజంపేట ఒకటో వార్డులో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ కాలనీవాసులు సోమవారం రహదారిపై ఆందోళనకు దిగారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని వార్డు సభ్యురాలికి విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సమస్య తీర్చేందుకు సర్పంచ్ హామీ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. పది రోజుల్లో నీటి సమస్య పరిష్కరిస్తానని సర్పంచ్ ఆముద సౌమ్య హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని సోమర్యాగడి తండా పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో ప్రకాష్ సోమవారం రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి వెంకటరాములుకు సూచించారు. అనంతరం నర్సరీ, ప్రకృతి వనాన్ని పరిశీలించారు.

బీజేపీలో చేరిక



మాచారెడ్డి: మండలంలోని భవానిపేట కిసాన్ నగర్ కాలనీకి చెందిన పలువురు యువకులు సోమవారం బీజేపీ రాష్ట్ర నాయకులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పలువురు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బూస సురేష్, తోట బాల్ రాజ్, దోమకొండ స్వామి, శ్రీనివాస్ చారి, నర్సింలు పాల్గొన్నారు.

క్యాంపస్‌లో సమస్యల పరిష్కారానికి వినతి



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నశీలకు వినతి పత్రాన్ని అందజేశారు. పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతానని ఆమె వెల్లడించారు.

పరీక్షలకు 16 మంది విద్యార్థుల గైర్హాజర్..

సౌత్ క్యాంపస్‌లో సోమవారం నిర్వహించిన పీజీ మొదటి, రెండో ఏడాది పరీక్షలకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నశీల తెలిపారు.

పోషకాహార కిట్ల అందజేత



మద్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సోమవారం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దరాస్ సురేష్ పోషకాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విఠల్, పాఠశాల హెచ్ఎం భీంరావ్, చైర్మన్ హన్మ బాయి, వైస్ చైర్మెన్ లలిత, ఆయుష్ వైద్యాధికారి ఆషాదేవి పాల్గొన్నారు.

వంద పడకల ఆస్పత్రి కోసం కృషి



దోమకొండ: మండల కేంద్రంలోని 30 పడకల ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా మార్పు చేసేందుకు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ సంగీత్‌కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆస్పత్రిలో మైక్రో స్కోప్ కంటి ఆపరేషన్ల యంత్రం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈసీజీ, స్కానింగ్, కంటి ఆపరేషన్లు చేసేందుకు అవసరమైన వసతులు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యులు షమీమ్, డాక్టర్ శ్రీవాణి, పద్మావతి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీను పాల్గొన్నారు.

అంచనాలకే పరిమితం

- పనులు ఎప్పుడు చేపడతారు?
- ట్రాన్స్‌కో అధికారులపై సభ్యుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాధాబలరామ్

గాంధారి: మండలంలోని పలు గ్రామాలు, తండాల్లో విద్యుత్‌కు సంబంధించిన మరమ్మతు పనులు అంచనాలకే పరిమితం అయ్యాయని ట్రాన్స్‌కో అధికారులపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ రాధాబలరామ్ నాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల నిర్లక్ష్యంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమారం తండా, గొల్లాడి తండాతో పాటు మరికొన్ని గ్రామాల్లో మూడేళ్లుగా విద్యుత్తు స్తంభాలను మార్చడం లేదని ఆరోపించారు. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా అంచనాలు వేసినట్లు చెబుతున్నారే తప్ప పనులు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీ ఆస్పత్రిలో డాక్టర్లు లేరని వెంటనే నియమించాలని సర్పంచ్ సంజీవు కోరారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఎంపీటీసీ సభ్యుడు కామెల్లి బాల్‌రాజు అన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఏఎంసీ చైర్మన్ సత్యంరావు, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ గోవర్ధన్ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రుణాలు ఇవ్వాలి..



సమావేశమైన సొసైటీ చైర్మన్ నర్సింలు, రైతులు



మాట్లాడుతున్న పుల్కల్ సొసైటీ చైర్మన్ రాంరెడ్డి

ఎల్లారెడ్డి: రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందించాలని సోమవారం ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో తీర్మానించారు. అదేవిధంగా రైతులకు సంబంధించిన రుణాలను ఏక కాలంలో మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ప్రశాంత్‌గౌడ్, కార్యదర్శి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రైతుల సహకారంతోనే సంఘం అభివృద్ధి

బిచ్కుంద: రైతుల సహకారంతోనే పుల్కల్ సొసైటీ అభివృద్ధి సాధించిందని చైర్మన్ రాంరెడ్డి అన్నారు. సోమవారం సంఘంలో రైతు మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా పెద్దదడ్గి, బండారెంజల్ గోదాం నిర్మాణానికి తీర్మానం చేసినట్లు వెల్లడించారు. వాజిద్‌నగర్‌లో ఐకేపీ ద్వార జరుగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవినీతికి పాల్పడుతున్నారని, అందుకు సొసైటీ ద్వారా కొనుగోలు చేయాలని రైతులు సమావేశం దృష్టికి తీసుకరావడంతో ఖరీఫ్ నుంచి కొనుగోలు చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. సొసైటీ ద్వారా నిర్వహించిన కొనుగోలు కేంద్రాల కమిషన్ రూ. 76 లక్షలు సంఘానికి రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాజుపటేల్, సంఘం డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు



ఆత్మకూర్‌లో పంటను పరిశీలిస్తున్న డీఏవో



మదన్‌హిప్పర్గాలో ఏవో రాజు..

నాగిరెడ్డిపేట: వరి పంటలో కాండం తొలుచు పురుగు, మెడ విరుపు తెగులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి (డీఏవో) భాగ్యలక్ష్మి రైతులకు సూచించారు. మండలంలోని మాసాన్‌పల్లి, ఆత్మకూర్ గ్రామాలలో సోమవారం పంటల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వరి పంటను పరిశీలించి తెగులు నివారణకు పలు సూచనలు చేశారు. కాండం తొలుచు పురుగు నివారణకు ఎకరానికి 80 నుంచి100 మిల్లీలీటర్ల టెట్రానిలి ప్రోల్ మందును పిచికారి చేయాలన్నారు. అగ్గి తెగులు, మెడవిరుపు తెగులు నివారణకు ఎకరంకు 80 గ్రాముల టేబుకొనజోల్, ట్రిఫ్లాక్సిఈస్ట్రోబిన్ అనే మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఆమె వెంట ఆత్మకూర్ సర్పంచ్ బాల్‌రెడ్డి, ఏవో విజయ్‌శేఖర్, ఏఈవో దివ్య ఉన్నారు.

మద్నూర్: డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గా గ్రామంలో సాగు చేసిన వరి పంటను మండల వ్యవసాయ అధికారి రాజు పరిశీలించారు. అగ్గి తెగులు, కంకినల్లి, కాండం తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో సంరిన్, రైతులు పాల్గొన్నారు.

రుణ మాఫీ పథకాన్ని అమలు చేయాలి



భిక్కనూరు: ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ పథకాన్ని వెంటనే అమలు చేయాలని మండలంలోని అంతంపల్లి సింగిల్‌విండో పాలకవర్గం సోమవారం తీర్మానించింది. అధ్యక్షుడు అలకొండ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో యాసంగిలో సాగు చేసిన ధాన్యం కొనుగోలు వేగవంతం చేసేందుకు తగినంత మంది హమాలీలను నియమించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో విండో సీఈవో శ్రీనివాస్, రైతు సమన్వయ సమితి గ్రామ కో ఆర్డినేటర్ అలకొండ గంగారెడ్డి పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్

భిక్కనూరు: ఇష్టపడి చదివితే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని కామారెడ్డి కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేశ్ అన్నారు. సోమవారం తన సతీమణి నంద రేఖతో కలిసి ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనాథ్, టీచర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో ప్రొఫెసర్ రామ్‌సింగ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుమలత, హాజీనాయక్, పాఠశాల కరెస్పాండెంట్ శ్యాంరెడ్డి పాల్గొన్నారు.

కబ్జా చేసిన పొలాన్ని ఇప్పించాలని ఆందోళన



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న బాధితులు

నస్రుల్లాబాద్: కబ్జా చేసిన పొలాన్ని సర్వే చేసి తమకు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండలంలోని నెమ్లి గ్రామానికి చెందిన కల్లాల్ పెద్ద పోశ బోయి, గంగబోయి, గంగవ్వ, శేఖర్ తదితరులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. తమకు పట్టా పాసు పుస్తకాలు ఉన్నా న్యాయం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వారికి మద్దతుగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రవిందర్ తదితరులు దీక్షలో పాల్గొన్నారు.కుటుంబ సభ్యులు ఉన్నారు.

పేదలకు భూములు పంచాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

తాడ్వాయి: భూమిలేని నిరుపేద రైతులకు మండలంలోని అబ్దుల్లానగర్ శివారులో ఉన్న ప్రభుత్వ భూమిని పంపిణీ చేయాలని తెలంగాణా రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ వెంకటేష్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, నాయకులు రూప్‌సింగ్, శంకర్, గణేష్, సాయిబాబా, రవి, జైరాం, సంగవ్వ, సత్యవతి, లక్ష్మీ, అంబిక తదతరులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధ్యక్షుడు సాయిలు

బాన్సువాడ రూరల్: రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని బీఆర్ఎస్ బోర్లం గ్రామ అధ్యక్షుడు గోపన్‌పల్లి సాయిలు కోరారు. సోమవారం గ్రామంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ గ్రామ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ స్థానంలో ఆయన కుమారుడు సయ్యద్ అమీర్‌హుస్సేన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రావణి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు సయ్యద్ జలీల్, నాయకులు దేవేందర్‌రెడ్డి, మంద శ్రీనివాస్, మన్నె రమేష్,నాగభూషణం, సాయిరెడ్డి, సత్యం, మహిబూబ్, ఆహ్మద్, సులేమాన్, మెహరాజ్, హన్మాండ్లు, ఆనంద్, అర్షద్‌ఖాన్, సాయిలు, దుర్కి గంగాధర్ ,సిద్దూ, భాస్కర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు కేసీఆర్‌తోనే సాధ్యం



పిట్లం: సంక్షేమ పథకాల అమలు సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని ఎంపీపీ కవిత పేర్కొన్నారు. సోమవారం ఆమె మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ జోన్న విజయరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసరి రమేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

బాన్సువాడ: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థినులకు సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఎక్కువ సమయం పాఠశాలలోనే చదువుతున్నందున విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఝాన్సీబాయి, బీఆర్ఎస్ నాయకులు కటికె రమేష్, హైమద్, నార్ల ఉదయ్ పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని నర్సింగ్‌రావ్‌పల్లి హెల్త్ సబ్‌సెంటర్‌లో సోమవారం పలువురికి రక్తహీనతకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి అవసరమైన మందులు, పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పుష్ప, సవిత, వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడి టీచర్లు లక్ష్మి, పద్మ, విజయలక్ష్మి, లలిత, సాయవ్వ, ఆశావర్కర్లు మనీశ, మంజుల, ముక్తాబాయి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం



మాచారెడ్డి: మండల కేంద్రమైన మాచారెడ్డి అంగన్‌వాడి కేంద్రంలో ఉన్న చిన్నారులకు సర్పంచ్ లలిత సోమవారం అక్షరాభ్యాసం, అన్న ప్రాసన నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆస్మా బేగం, పలువురు అంగన్ వాడి టీచర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఎదుగుదల



మాట్లాడుతున్న సీడీపీవో కళావతి

బాన్సువాడ రూరల్: పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యవంతమైన ఎదుగుదల ఉంటుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సీడీపీవో కళావతి అన్నారు. సోమవారం హన్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని అవాజీపల్లి తండా అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ్ పక్షోత్సవాల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్నారులకు రోజు పోషక విలువలు కలిగిన కూరగాయలు, ఆకు కూరలు, గుడ్లు, పప్పు దినుసులు ఆహారంగా అందించాలన్నారు. బాలికలకు రక్తహీనతకు సంబంధించి పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనాల సుభాష్, ఉప సర్పంచ్ అక్బర్, సూపర్‌వైజర్ షహనాజ్, కార్యదర్శి రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు రేణుక తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బిచ్కుంద: మండలంలోని సితరాంపల్లి, మాన్యాపూర్‌లో ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులు వీధుల్లో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పల్లె ప్రకృతి వనంలో పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం పరిశుభ్రతపై గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ గంగారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రముఖీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ సంజీవ్‌రెడ్డి, వెంకటేశం పాల్గొన్నారు.



దుర్కిలో శ్రమదానం చేస్తున్న విద్యార్థులు

ఎస్ఆర్ఎన్‌కే విద్యార్థుల ఆధ్వర్యంలో..

నస్రుల్లాబాద్: మండలంలోని నెమ్లి, దుర్కి గ్రామాల్లో బాన్సువాడలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల విద్యార్థులు శ్రమదాన కార్యక్రమంలో భాగంగా ప్రధాన రహదారులు, హనుమాన్ ఆలయం, జెడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాల్లో ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రమణ్యం, ఏపీవో రాము, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, ఎంపీటీసీ కుమ్మరి నారాయణ, పీఏసీఎస్ చైర్మన్ డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

■ నేడు హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్ఠ

తాడ్వాయి: మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ విగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ సంజీవులు తెలిపారు. స్థానికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

■ ఆత్మీయ సమ్మేళనం

తాడ్వాయి: మండలంలోని దేమికలాన్ గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మద్ది మహెందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపాల్‌రావు తెలిపారు. అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొనాలని కోరారు.

■ రేపు తైబజారు వేలం పాట

గాంధారి: గాంధారి గ్రామ పంచాయితీకి సంబంధించి బుధవారం తైబజార్, పశువుల డాకల చిట్టీ వేలం వేయనున్నట్లు సర్పంచ్ సంజీవు, కార్యదర్శి నాగరాజు తెలిపారు.

కంటి సమస్య ఉంటే అద్దాల పంపిణీ



కంటి వెలుగును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సదాశివనగర్: కంటి సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి అద్దాలు పంపిణీ చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మి, ఎంపీవో సురేందర్ రెడ్డి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో చంద్రశేఖర్, పీహెచ్‌సీ డాక్టర్ అస్మ, సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ వంకాయల రవి, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, వీడీసీ చైర్మన్ కుమ్మరి రాజు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

రామారెడ్డి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దశరత్‌రెడ్డి సూచించారు. సోమవారం మండలంలో ఇస్సన్నపల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బాలమణితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రవీందర్రావు, డాక్టర్ సురేష్, బీఆర్ఎస్ మండల్ అధ్యక్షుడు రంగు రవీందర్ గౌడ్ ,రైతు కమిటీ అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్ జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వవిద్యార్థి ఆకుల్ వార్ బాలాజి సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకాగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారం నాణ్యతపై అవగాహన

భిక్కనూరు: బంగారం నాణ్యతపై స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీఐఎస్ (బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) అధికారులు బీఆర్‌కే రావ్, శేఖర్, సుహాసిని అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు సుమాదిర్, భువనచంద్ర, స్ఫూర్తి రెడ్డి, హుస్సేన్‌బీ, సహస్ర, వంశీ, శ్రీనిధి, ఆధిక్యలకు బహుమతలు అందజేశారు. హెచ్ఎం శ్రీనాథ్, ఉపాధాయులు వెంకటేశ్వర్లు, బాలగంగాధర్, ఉదయ్ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం ఏర్పాటు

పెద్దకొడప్‌గల్: మండలంలోని బాబుల్‌గావ్ గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించారు. రెండు రోజుల కిందట నిర్వహించిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో బస్సు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యే హన్మత్‌సింధేను కోరారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మద్నూర్: విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం అందించాలని సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు దరాస్ సురేష్, ఉప సర్పంచ్ విఠల్ సూచించారు. స్థానిక బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలను వారు తనిఖీ చేశారు.

వలస కూలీలకు దుస్తుల పంపిణీ

లింగంపేట: మండలంలోని మోతె గ్రామానికి చెందిన పెంటయ్య పెద్దకొడప్‌గల్ నుంచి వలస వచ్చిన కూలీలకు దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు.

విజయం కోసం సైనికుల్లా పని చేయాలి

నస్రుల్లాబాద్: ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ సూచించారు. సంగం, హాజీపూర్ కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ పాల్త్య విఠల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్‌ఖాన్, నాయకులు రాము, సాయి యాదవ్, రావుల సాయాగౌడ్ పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ పదవి అవిశ్వాసంపై బలపరీక్ష

నాగిరెడ్డిపేట: గోపాల్‌పేట ఉప సర్పంచ్ దుర్గేశ్‌పై వార్డు సభ్యులు పెట్టిన అవిశ్వాసంపై మంగళవారం బల పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్డీవో శ్రీనునాయక్ తెలిపారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

భిక్కనూరు: ప్రజల దాహార్తిని తీర్చేందుకు జంగంపల్లి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు అభినందనీయం అని సీఐ తిరుపయ్య పేర్కొన్నారు. బీటీఎస్, అంతంపల్లి స్టేజిల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎస్సై ఆనంద్‌గౌడ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు.

హనుమాన్ ఆలయానికి వెండి వితరణ

బాన్సువాడ: పట్టణంలోని పాత బాన్సువాడ హనుమాన్ ఆలయానికి పట్టణానికి చెందిన పవన్‌కుమార్, దాత్రిక్ సువర్ణ, గురు సురేందర్ వెండిని ఆలయ కమిటీ కార్యదర్శి ఉమ మహేష్‌కు అందజేశారు.

రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు

సదాశివనగర్: వజ్జపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సర్పంచ్ ఎర్రం నర్సయ్యతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.